క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల గ్రామోత్సవం


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

కొలిమిగుండ్ల: బందార్లపల్లె సమీపంలోని నేల బెలుం తిరుణాల ముగియడంతో మంగళవారం ఘనంగా గ్రామోత్సవం చేశారు. నేల బెలుం నుంచి శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య వాహనంలో బందార్లపల్లెలోని వీధుల్లో గ్రామోత్సం నిర్వహించారు. గ్రామస్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ హుండీని లెక్కించగా భక్తులు వేసిన విరాళాల ద్వారా రూ.48 వేలు వచ్చింది.

తుపాన్‌తో జాగ్రత్త


పాతపాడులో రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీ


బనగానపల్లె రూరల్: తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాతపాడు, పసుపల గ్రామాల్లో పర్యటించారు. రైతులకు తుపాన్‌పై జాగ్రత్తలతో పాటు మొక్కజొన్న, జొన్న పంట సస్యరక్షణపై పలు సూచనలు చేశారు. రైతులు జొన్న పంటకు బీమా చేయించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు తుపాన్ ఉందని, ఈ ప్రభావం పంటలపై పడే అవకాశం ఉందన్నారు.

ఉసిరి, బిల్వ వృక్షాలకు పూజలు


మాట్లాడుతున్న శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ

డోన్: కార్తీక మాసం ఏకాదశి పుణ్యతిథిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక గాయత్రీ పీఠంలో బ్రాహ్మణ సంఘం సభ్యులు ఉసిరి, బిల్వ వృక్షాలకు పూజలు నిర్వహించారు. కళారత్న, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ మాట్లాడుతూ.. ధాత్రి నారాయణ స్వరూపమైన ఉసిరి, బిల్వ వృక్షాలకు పూజలు చేయడం పుణ్యఫలం అన్నారు. కార్యక్రమంలో సాంబ శివాలయ ప్రధాన అర్చకుడు కల్లె శేషావలిశర్మ, శ్రీనివాసశర్మ, సత్యనారాయణ శర్మ, సుదేంద్రశర్మ, రమేష్, గంగాధర శాస్త్రి, మురళి, మధు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


దస్తగిరి బాషా (ఫైల్)

డోన్ రూరల్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని పీఎంవై ఆఫీస్ ఎదురుగా రైలు పట్టాలపై యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. రైల్వే జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. ప్యాపిలి మండలం ఎస్.రాచర్ల గ్రామానికి చెందిన దస్తగిరి బాషా(20) సోమవారం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. మంగళవారం ఉదయం రైల్వేస్టేషన్ సమీపంలో శవంగా కనిపించడంతో ట్రాక్‌మెన్‌లు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. యువకుడి ఫోటోలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో కుటుంబ సభ్యులు గమనించి రైల్వే పోలీసులను సంప్రదించారు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

డోన్ రూరల్: సారా తయారీ, అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి అన్నారు. ప్యాపిలి మండలం అలేబాద్‌తండా గ్రామంలో మంగళవారం దాడులు నిర్వహించి 350 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. అలాగే డోన్ మండలం దేవరబండ, ఎర్రగుంట్ల గ్రామాల్లో ఈడిగ రాముడు, నక్క సుంకన్న మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల నుంచి 14 మద్యం బాటిళ్లు, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో ఎస్‌ఐ దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాహనాలకు జరిమానా

డోన్ రూరల్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఆర్‌టీఓ క్రాంతికుమార్ మంగళవారం వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా లేని పది వాహనాలకు రూ.3,43,300 జరిమానా విధించారు. వాహనదారులు లైసెన్స్‌తో పాటు అన్ని రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మూగ వేదన

- పశువైద్యశాలల్లో వేధిస్తున్న మందుల కొరత
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- పశువుల యజమానులకు తప్పని తిప్పలు



కొలిమిగుండ్ల పశువైద్యశాల


మూగజీవాలకు చికిత్స అందిస్తున్న వైద్యురాలు (ఫైల్)

కొలిమిగుండ్ల: మూగజీవాల సంరక్షణపై ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఆవులు, గేదేలు, గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకితే తగిన వైద్యం అందించేందుకు ప్రభుత్వ పశు వైద్యశాలల్లో సరైన మందులు అందుబాటులో లేవు. దీంతో పశువుల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా పశువులు, జీవాలు, కోళ్లకు వైద్య సేవలు అందించేవారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత పశుసంచార వాహనాలపై ఉన్న వైఎస్సార్ పేర్లు, ఫొటోల తొలగింపుపై పెట్టిన దృష్టి మూగజీవాలకు వైద్యం అందించడంలో పెట్టడంలేదని మూగజీవాల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన మందుల సరఫరా

మూగజీవాలే కదా బతికినా..చచ్చినా ప్రశ్నించేవారెవరు అనే రీతిలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అయినా పశువైద్యశాలలకు మందులను సరఫరా చేయడంలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంపిన మందులనే ఇప్పటి వరకు సర్దుబాటు చేస్తూ వచ్చారు. ప్రతి పశు వైద్యశాలకు మూడు నెలలకొకసారి రూ.50 వేల నుంచి రూ.70 వేల విలువ చేసే మందులు అవసరపడుతాయి. జిల్లాలో మొత్తం 15 ప్రాంతీయ పశు వైద్యశాలు, 74 పశు వైద్యశాలలు, 99 గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. జిల్లాలో ఆవులు, గేదేలు, ఎద్దులు 4,14,397, గొర్రెలు 4,14,395, మేకలు 8,82,449, కోళ్లు 7,01126 మొత్తం కలిపి 18,89,429 ఉన్నాయి. వీటికి అత్యవసర చికిత్సకు ఉపయోగించే యాంటీబయాటిక్స్, పెయిన్‌కిల్లర్స్, విషపూరితమైన మేత తిన్నప్పుడు వాడే మందులు, పశువులు బాగా మేత తినడానికి వాడే మందులు, క్యాల్షియం, ఎముకలపొడి తదితర 300 రకాల మందులను ప్రభుత్వ పశు వైద్యశాలలకు సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు మందులను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో మూగజీవాల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు.

గతంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పశువులకు సంబంధించిన మందులను ఇండెంట్ పెట్టేందుకు జిల్లా స్థాయిలో కమిటీ ఉండేది. పశువైద్యశాలల్లో విధులు నిర్వహించే వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏడీఏలు ఇలా ఎవరికివారు తమ పరిధిలో ఉండే పశువులకు ఇతర మూగజీవాలకు ఎలాంటి మందులు కావాలో ఇండెంట్ పెట్టుకునే అవకాశం ఉండేది. ఇలా ప్రతి మూడు నెలలకు ఒకసారి కచ్చితంగా మందులను జిల్లా స్థాయి అధికారులు పశువైద్యశాలలకు సరఫరా చేసేవారు. ప్రసుత్తం పశువైద్యులు ఇండెంట్ పెట్టిన మందులు లేకపోవడంతో ఉన్నతాధికారులు కూడా నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

> **ప్రతిపాదనలు పంపాం**
>
> పశువైద్యశాలల్లో మందుల కొరతపై ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. జిల్లా ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చాం. కొద్ది రోజుల్లో మందులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న వాటితో సర్దుబాటు జరుగుతుంది. ప్రతి మూడు నెలలకొకసారి మందులు రావాల్సి ఉంటుంది.
>
> –మోహన్‌రావు, ఏడీ, పశుసంవర్థకశాఖ

ప్రధాన మందుల కొరత

ప్రధానంగా యాంటిబయాటిక్స్, పొట్ట ఉబ్బరం వస్తే ఉపయోగించే టిమ్‌ఫోనిక్, పాదుగు వ్యాధి వస్తే ఉపయోగించే మందులతో పాటు యాంటీబాయాటిక్స్, చర్మవ్యాధుల నివారణకు ఉపయోగించే సల్ఫర్‌బేస్ట్ పౌడర్, జ్వరానికి ఉపయోగించే పారాసిటమాల్ మందుల కొరత ఉంది. దీంతో పశువులు, మేకలు, జీవాల యజమానులు తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని కాపాడుకునేందుకు బయట మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలోని 29 పశు వైద్యశాలల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

విద్యుత్ సరఫరాపై విద్యార్థులకు అవగాహన



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొలిమిగుండ్ల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా మోడల్ స్కూల్ ఒకేషనల్ ట్రైనర్స్ అప్సార్‌బాషా, రామ్మోహన్ ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులు సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ట్రాన్స్‌ఫార్మర్ పనితీరు, అత్యవసర సమయంలో ఫీడర్స్ వల్ల కలిగే ఉపయోగాలు, విద్యుత్ సరఫరాను ఎలా చేస్తారు? అనే అంశాలపై సబ్‌ఇంజినీర్ లక్ష్మణస్వామి విద్యార్థులకు వివరించారు. అలాగే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాదారులకు అందించే వివిధ రకాల సేవలపై మేనేజర్ ఆంజనేయులు తెలియజేశారు. బ్యాంక్ అకౌంట్, పొదుపు చేయడం, రుణాలు పొందడంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వివిధ రంగాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి తెలిపారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కోవెలకుంట్ల: రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దకొప్పెర్ల, చిన్నకొప్పెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వివిధ పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మొక్కజొన్నను కత్తెర పురుగు ఆశించినట్లు గుర్తించామన్నారు. నివారణకు లీటరు నీటికి 2 ఎంఎల్ ఇండాక్సికార్, నోవాల్యూరాన్ లేదా ఇమామెక్టిన్, నోవాల్యూరాన్ మందులను పిచికారీ చేయాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన పథకం కింద శనగ, జొన్న, మినుము పంటలకు రైతులు బీమా ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. ఆయా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి రబీ పంటల నమోదు చేయించుకోవాలన్నారు.

పంట బీమాతో రైతుకు భరోసా


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

అవుకు: రబీ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని.. తద్వారా పంట నష్టం జరిగినప్పుడు పరిహారం అందుతుందని కోవెలకుంట్ల వ్యవసాయ సంచాలకులు సుధాకర్ అన్నారు. మంగళవారం అవుకు మండల పరిధిలోని మెట్టుపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శనగ, మినుము, వరి, జొన్న, వేరుశనగ, ఉల్లి పంటలు సాగు చేసిన రైతులు డిసెంబర్ 15వ తేదీలోపు మీసేవా, సచివాలయాల్లో పంట బీమా చేసుకోవాలని పేర్కొన్నారు. శనగ, జొన్న, వరి రైతులు హెక్టారుకు రూ.210, రూ.149, రూ.315, మినుము హెక్టారుకు రూ.119, వేరుశనగ, ఉల్లి పంటలకు రూ.160, రూ.225 ప్రీమియం చెల్లించాలని తెలిపారు. శనగ పంటలో సస్యరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం భూసార నమూనా పత్రాలను రైతులకు అందజేశారు. ఏఈఓ నవీన్ తేజ, ఎంపీఈఓ రామక్రిష్ణ ఉన్నారు.

బేతంచెర్ల: రబీ పంట నమోదును మీసేవా కేంద్రాల్లో చేసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ సూచించారు. బేతంచెర్ల, గోర్లగుట్ట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓలు మధు, ప్రజ్ఞ, అగ్రికల్చర్ అసిస్టెంట్ సద్దాం పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ సరళ

కోవెలకుంట్ల: మేజర్ గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమష్టి కృషి చేయాలని సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ఈఓ ప్రకాష్‌నాయుడు అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. మంగళవారం స్థానిక మేజర్ పంచాయతీలో వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ వార్డుల్లో డ్రెయినేజీ, సీసీరోడ్లు తదితర మౌలిక సదుపాయాల కొరత ఉందని వార్డు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. గ్రామ పంచాయతీకి కేటాయించే నిధులతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులను వార్డు సభ్యులకే కేటాయించాలని కోరారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలు, యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన పనులపై రాత పూర్వకంగా తెలియజేస్తే ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ఈఓ తెలిపారు.

శివునికి ప్రీతిపాత్రమైన కార్తీక మాసం

ప్యాపిలి: పరమ శివునికి కార్తీక మాసం ఎంతో ప్రీతిపాత్రమైందని ధార్మిక ప్రవచకులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తొగట సురేష్ బాబు అన్నారు. స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కార్తీక మాస విశిష్టతను వక్తలు వివరించారు. హిందూ ఆచారాలన్నీ ప్రకృతితో ముడిపడి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకుడు మల్లు వెంకటరెడ్డి, సభ్యులు దేవీ దయానంద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై విజిలెన్స్ విచారణ


కోవెలకుంట్లలో రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

కోవెలకుంట్ల: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్థలాలు లేని గ్రామాల్లో రైతుల నుంచి పొలాలను కొనుగోలు చేసి నవరత్నాలు– పేదలందరికీ ఇళ్ల పథకం కింద ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఈ భూముల కొనుగోలులో అవినీతి జరిగిందన్న కోణంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం నంద్యాల జిల్లాలో విచారణ చేపట్టారు. బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో విజిలెన్స్ అధికారులు రైతులతో విచారణ జరిపారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 11 మంది రైతుల నుంచి 20 ఎకరాల భూమిని కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అలాగే మండలంలోని గుళ్లదూర్తి, అమడాల గ్రామాల్లో రైతుల వద్ద నుంచి భూములు కొనుగోలు చేసి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. విజిలెన్స్ అధికారుల బృందం ఆయా గ్రామాలను చేరుకుని భూములు అమ్మిన రైతులను స్వయంగా కలిశారు. అప్పటి ప్రభుత్వం పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించిందా, ఏవైనా ప్రలోభాలకు గురి చేసి భూములు తీసుకున్నారా, ప్రభుత్వం నిర్ణయించిన ధర సమ్మతమేనా, ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా? అన్న విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణయించిన ధర ప్రకారం భూములకు ధర చెల్లించారని, ఎలాంటి బెదిరింపులు లేవని, భూముల ధర సమ్మతంగా ఉందని రైతులు విజిలెన్స్ అధికారులకు తెలియజేశారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

- విజేత నాగర్ కర్నూలు


పోటీలను ప్రారంభిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల


సంజామల: హోరాహోరీగా సాగుతున్న ఎద్దుల పోటీలు

బేతంచెర్ల: వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని శంకరాపురం గ్రామంలో మంగళవారం పాల బండలాగుడు పోటీలు నిర్వహించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. మొత్తం 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. యువకుల ఈలలు, కేరింత మధ్య హోరాహోరీగా సాగిన పోటీల్లో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా, రాయవరం రామచంద్రారెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచాయి. కర్నూలు జిల్లా క్రిష్ణప్రసాద్, చిన్న రత్నం సంయుక్తంగా ద్వితీయ, నంద్యాల జిల్లా పాణ్యం మండల పిన్నాపురం వెంకట క్రిష్ణయ్య ఎడ్లు తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఆ తర్వాత స్థానాల్లో నంద్యాల మండలం బిల్లాలాపురం గోవర్ధన్‌రెడ్డి, వనపర్తి జిల్లా జశ్వంత్ యాదవ్, వెల్దుర్తి, కలుగోట్ల క్రిష్ణ ఎడ్లు కైవసం చేసుకున్నాయి.

రాతిదూలం పోటీలు

సంజామల: నయనాలప్ప క్షేత్రంలో రాతిదూలం పోటీలు హోరాహోరీగా సాగాయి. నాలుగు పళ్ల విభాగంలో మొదటి బహుమతి వైఎస్సార్ జిల్లా చెన్నూర్‌కు చెందిన సాయి కుమార్ రెడ్డి, రెండో బహుమతి వైఎస్సార్ జిల్లాకు చెందిన మెక్షజ్ఞరెడ్డి, మూడో బహుమతి నంద్యాలకు చెందిన నరసింహారెడ్డి, నాలుగో బహుమతి బనగాపల్లెకు చెందిన నాగేంద్ర కైవసం చేసుకున్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

- అంబేడ్కర్ విగ్రహాలకు నివాళి


బనగానపల్లె: జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో..


కొలిమిగుండ్ల: ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది


కోవెలకుంట్ల: జెడ్పీ ఉన్నత పాఠశాలలో దేశనాయకుల వేషధారణలో విద్యార్థినులు


అవుకు: నివాళులర్పిస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి


డోన్: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి


ప్యాపిలి: నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


బనగానపల్లె: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


డోన్: నివాళులర్పిస్తున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు


బేతంచెర్ల: ఎంపీపీ నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తదితరులు

బనగానపల్లె: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. బనగానపల్లెలోని అవుకుమెట్ట వద్ద మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతోందన్నారు. ప్రశ్నించేవారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను గాలికొదిలేసి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టడంపై దృష్టి పెట్టిందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడమే తప్పా ప్రజా సమస్యలను ప్రస్తావించలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అబ్దుల్‌ఫైజ్, సురేష్, ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కరీం, సత్యంరెడ్డి, కలాం, ఖానిక్, కిశోర్, నీలిశ్రీనివాసులు, రామసుబ్బారెడ్డి, మాధవరెడ్డి, అబ్దుల్‌లతాహీర్, నారాయణ, వెంకటస్వామిరెడ్డి, బాలు తదితరులు పాల్గొన్నారు.

- బనగానపల్లె రూరల్: స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఎంపీడీఓ వెంకటరమణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం యాగంటప్ప, గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపసర్పంచ్ బురానుద్దీన్, ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.
- డోన్: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కాకముందే మానవ హక్కులు మంటగలిసిపోయాయని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, పోస్టుపసాద్‌తో కలిసి నివాళులర్పించారు. రాజ్యాంగ హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని దుయ్యబట్టారు. పోలీసులు అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ సోమేష్ యాదవ్, నాయకులు రాజవర్ధన్, పాతపేట రఫి, మల్యాల శ్రీనివాసరెడ్డి, హరి, ప్రతాప్‌రెడ్డి, శ్రీను, లక్ష్మిరెడ్డి, చిరంజీవి, రాజు, శేఖర్ యాదవ్, వెంకటేష్, ఆదాం తదితరులు పాల్గొన్నారు.
- బేతంచెర్ల: స్థానిక శేషారెడ్డి సీహెచ్‌సీ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, మార్కు జావలీ, ఖాజా, లక్ష్మిరెడ్డి, గూని నాగరాజు, మురళీకృష్ణ నివాళులర్పించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ రంగస్వామి, కోట్ల మధు, బొల్లి మద్దిలేటి, మేకల నాగరాజు, రాజయ్య, నాగ మోహన్ పాల్గొన్నారు.
- కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, కోవెలకుంట్ల మేజర్ పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రాజయ్య, బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం అరుణకుమారి, గురుకుల పాఠశాలలో బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు రెడ్డిపల్లె ఓబయ్య ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- అవుకు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే మదర్ మోడల్ స్కూల్లో కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ వెంగన్న, తహసీల్దార్ సువర్ణాదేవి పాల్గొన్నారు.
- కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయ్యాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు.
- డోన్ టౌన్: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంఈఓ–2 రామనర్సప్ప, పాతపేట జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, మహ్మద్‌రఫీ, ఎమ్మార్పీఎస్ నేత ఈశ్వర్య మాదిగ, కాంగ్రెస్ నేత మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.
- ప్యాపిలి: ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిలేటి, రంగన్న, వెంకటరాముడు, బాలరంగన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.